సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 12 । జూలై । 2024



ఫైనల్స్‌కు లయన్స్

ఏపీఎల్ మూడో సీజన్ ఫైనల్స్‌కు ఉత్తరాంధ్ర లయన్స్ చేరుకుంది. వారియర్స్, కింగ్స్ జట్ల మధ్య శుక్రవారం పోటీ జరగనుంది. 8లో



త్వరితగతిన పనులు

8లో

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు నిర్దేశించిన సమయంలో పూర్తవుతాయని మత్స్యశాఖ కార్యదర్శి ఎ.బాబు తెలిపారు.



నటి మీనాక్షి చౌదరి సందడి

ఖిలాడీ, గుంటూరు కారం తదితర చిత్రాల్లో నటించిన మీనాక్షి చౌదరి గాజువాకలో గురువారం సందడి చేశారు.

న్యూస్‌రీల్

విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి



సాక్షి, విశాఖపట్నం : విశాఖ రేంజ్ డీఐజీగా గోపీనాథ్ జట్టి నియమితులయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2008 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పీగా, 2015లో తిరుపతి అర్బన్ ఎస్పీగా, 2018 వరకు కర్నూల్ ఎస్పీగా పనిచేశారు. అనంతరం తిరుపతి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా ఐదేళ్ల పాటు పనిచేసి డీఐజీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం గ్రే హౌండ్స్‌లో డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసిన విశాల్ గున్నినీ డీజీపీ కార్యాలయాన్ని అటాచ్ చేశారు.

జీవీఎంసీ కమిషనర్‌గా హరేందిర ప్రసాద్ బాధ్యతలు

మహారాణిపేట: జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జీవీఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. బుధవారం సాయంత్రం తన కార్యాలయంలో సంబంధిత పత్రాలపై సంతకం చేసి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. పలువురు జిల్లా స్థాయి అధికారులు, జీవీఎంసీ అధికారులు హరేందిర ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఏపీ టౌన్‌షిప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయిన సంగతి విదితమే.

నృసింహావతారంలో జగన్నాథుడు



దాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథ స్వామి నృసింహావతారంలో గురువారం దర్శనమిచ్చారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లు బారులు తీరాయి. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకూ నిత్యపూజ, 7 నుంచి 9.30 గంటల వరకూ జగన్నాథస్వామి ప్రార్థన సంఘంచే ప్రార్థన తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకూ సామూహిక లలితా సహస్రనామ పారాయణ. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.

మొబైల్ యాప్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించండి

విశాఖ సిటీ: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఇటీవల సరికొత్త ఫీచర్లతో అందుబాటులోకి తీసుకువచ్చిన 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించవచ్చని ఏపీఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం తెలిపారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నవారి సంఖ్య లక్ష నుంచి 5.07 లక్షలకు పెరిగిందని చెప్పారు. కేవలం వారం రోజుల్లోనే 4 లక్షలకు పైగా వినియోగదారులు మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారని వెల్లడించారు. రోజువారీ లావాదేవీల సరాసరి సంఖ్య 5 వేల నుంచి అత్యధికంగా 70 వేల వరకు పెరిగిందన్నారు. మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు గత నెల మొదటి 10 రోజుల్లో రూ.3 కోట్లు కాగా.. ఈ నెల 10వ తేదీ వరకు రూ.50 కోట్లు వసూలు అయ్యాయన్నారు. అంతే కాకుండా ఈ యాప్ ద్వారా విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయడం, బిల్లు వివరాలు, బిల్లు లెక్కింపు వంటి మరెన్నో ఫీచర్లను అందిస్తున్నామన్నారు.

సీఆర్‌పీఎఫ్‌లో అగ్నివీర్‌లకు ప్రాధాన్యం



నేవల్ సివిలియన్స్ దినోత్సవంలో పాల్గొన్న పలు దళాల అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: సీఆర్‌పీఎఫ్‌లో అగ్నివీర్ల నియామకానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఆర్‌పీఎఫ్ డీజీ అనీష్ దయాల్ సింగ్ తెలిపారు. భీమిలి నేవల్ స్టేషన్‌లో నేవల్ సివిలియన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్ పాలసీలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీజీ మాట్లాడుతూ అగ్నివీర్‌లకు పది శాతం రిజర్వేషన్, వయస్సు మినహాయింపుతో పాటు శారీరక సామర్థ్య పరీక్ష ఉండదని స్పష్టం చేశారు. సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) డీజీ దల్జీత్ సింగ్ చౌదరి, ఆర్‌పీఎఫ్ డీజీ మనోజ్ యాదవ మాట్లాడుతూ ఎస్ఎస్‌బీ, ఆర్‌పీఎఫ్‌లలో కూడా అగ్నివీర్లకు ప్రత్యేక రిజర్వేషన్ ఉందని చెప్పారు.

తల్లికి వందనం ఒక్క బిడ్డకేనా



ఇది టీడీపీ సూపర్ సిక్స్‌లో స్కూల్‌కికు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటన



- ఎంతమందైనా రూ.15వేలు చొప్పున ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- తాజా ఉత్తర్వులతో పథకం అమలుపై సందేహాలు
- ఆధార్ అనుసంధానం పేరిట లబ్ధిదారుల ఏరివేతకు కుట్ర
- ఫీజులు కట్టాలని ప్రైవేట్ పాఠశాలల్లో ఒత్తిళ్లు
- తల్లికి వందనం సాయం కోసం ఎదురుచూపు

'నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. ఇగో నీకు రూ.15 వేలు' ఎన్నికల సమయంలో బాగా వైరల్ అయిన ఓ వీడియో చూసే ఉంటారు. ప్రస్తుత రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఓ ఇంటి దగ్గరకు వెళ్లి.. ఆ ఇంట్లో పిల్లలను చూపిస్తూ అందరికీ డబ్బులు వస్తాయని లెక్కలతో సహా చెప్పారు.

పిల్లలను బడికి పంపే తల్లుల విషయంలో జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందని.. తాము అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం వర్తింపజేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు.

కూటమి అభ్యర్థులు కూడా ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావించారు.

కట్ చేస్తే..

పిల్లలను స్కూల్‌కు పంపే అమ్మలకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అంటూ జీవో 29 పేరిట ఉత్తర్వులు జారీ చేసింది. అంటే ఒక ఇంట్లో.. ఒక్కరికే రూ.15 వేలు ఇస్తామని చెప్పకనే చెప్పింది. ఈ పథకం కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న తల్లుల్లో ఈ జీవోతో గందరగోళం నెలకొనగా.. రానున్న రోజుల్లో ఈ పథకంలో కోత పెట్టే మాయేనని అంతటా చర్చ నడుస్తోంది.

విశాఖ విద్య: పేద విద్యార్థుల చదువులు సవ్యంగా ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు. 'తల్లికి వందనం' పథకం కింద ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున ఇచ్చేందుకని ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో పలు అనుమానాలకు తావిస్తోంది. తల్లికి వందనం, అదే విధంగా స్టూడెంట్ కిట్ పంపిణీ చేసే విద్యార్థులకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరణకు ప్రభుత్వం సిద్ధం కావడమే ఈ అనుమానాలకు బలం చేకూరిస్తోంది. ఆధార్ అనుసంధానంతో ప్రతీ విద్యార్థి బయోమెట్రిక్ అథంటికేషన్ ధ్రువీకరించాలని ప్రభుత్వం తాజాగా స్పష్టం చేసింది. ఎన్నికల్లో కూటమికి ఓటు వేయని వారిని గుర్తించి, అలాంటి లబ్ధిదారులైన విద్యార్థుల పేర్లను జాబితాలోంచి తొలగించాలనే కుట్రల్లో భాగమే ఈ చర్యలని తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది.

డబ్బులు మంజూరయ్యేదెప్పుడో?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు అమ్మ ఒడి పథకం కింద మొత్తం రూ.1114.52 కోట్లు మంజూరు చేశారు. ఏటా జిల్లాలో 1.70 లక్షల నుంచి 2 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం అందింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలో ఉండి ఉంటే.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ నెలలోనే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో సీన్ రివర్స్ అయింది. తాజాగా పథకం అమల్లో మడతపేచీ పెడుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఫీజుల కోసం ప్రైవేటు పాఠశాలల ఒత్తిడి

బడికి వెళ్లే వారు ఎంత మంది ఉన్నా.. అందరికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీతో జిల్లాలోని చాలా మంది ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లలో చేరారు. అందరికీ తల్లికి వందనం డబ్బులు వచ్చే అవకాశం ఉందని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సైతం ఇందుకు ప్రోత్సహించాయి. కానీ.. తల్లికి వందనం డబ్బులు ఇప్పట్లో వచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో తమ స్కూళ్ల నిర్వహణ కష్టమని భావించిన ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి పెంచాయి. దీంతో తల్లిదండ్రులు తర్జనభర్జన పడుతున్నారు.

ఇంకా అందని యూనిఫాంలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బడులు తెరిచిన తొలిరోజునే ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ తొమ్మిది రకాల వస్తువులతో కూడిన విద్యాకానుక అందించారు. దీనికి కొనసాగింపుగా 2024–25 విద్యా సంవత్సరానికి ఎన్నికల ముందే అన్ని రకాల వనరులు సమకూర్చారు. ఈ లోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి పంపిణీ సవ్యంగా జరగలేదు. విద్యా కానుకలను 'స్టూడెంట్ కిట్'గా పేరు మార్చినా.. వాటిని పూర్తి స్థాయిలో అందించే విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. విద్యార్థులకు యూనిఫాంలు, షూలు ఇంకా ఇవ్వలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులు, మంజూరైన డబ్బులు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,95,442	290.16
2020-21	2,02,042	303.06
2021-22	1,75,065	262.60
2022-23	1,70,467	255.70
మొత్తం	7,43,016	1,114.52

అందరికీ ఇస్తామన్నారు..



నాకు ఒక పాప, ఒక బాబు. ఇద్దరు పిల్లలూ జీవీఎంసీ స్కూల్‌లో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో నాలుగు సార్లు అమ్మ ఒడి అందుకున్నాను. పాఠశాలలు తెరవగానే డబ్బులు బ్యాంకు ఖాతాలో పడ్డాయి. నా భర్త పెయింటింగ్ పనులు చేస్తుంటారు. పని చేస్తున్నప్పుడు పై నుంచి పడిపోవడంతో కాలికి దెబ్బ తగిలింది. ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆదాయం లేదు. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నాం.

–మహబూబ్ నిషా, ఎంటీసీ పాలెం

ఆశగా ఎదురు చూస్తున్నాం



నాకు ఇద్దరు పిల్లలు. గత ప్రభుత్వంలో పాపకు అమ్మ ఒడి ద్వారా ఆర్థిక భరోసా లభించింది. దీంతో పాఠశాలకు పంపించి మంచిగా చదివిస్తున్నాను. ఎన్నికల ప్రచార సమయంలో కూటమి నాయకులు ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే.. అంతమందికీ తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. బడులు ప్రారంభమై నెల రోజులవుతోంది. తల్లికి వందనం డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం.

– నాగిరెడ్డి రామలక్ష్మి, ఎంవీపీకాలనీ

ఆర్థిక భరోసా కల్పించాలి



నేను, నా భర్త, ముగ్గురు పిల్లలతో కలిసి ఏకేసీకాలనీలో నివాసముంటున్నాం. నా భర్త హెచ్‌పీసీఎల్‌లో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారు. ముగ్గురు పిల్లలను చదివించాలంటే తలకు మించిన భారం అవుతోంది. ఒకరిని చదువు మానిపించేద్దాం అనుకుంటున్న సమయంలో కూటమి నాయకులు భరోసా కల్పించారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని చెప్పడంతో పిల్లలను చక్కగా చదివించుకోవచ్చని ఆశపడ్డాం. ఎన్నికల్లో హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం అమలు చేస్తే.. ఆర్థిక భరోసా లభిస్తుంది. పిల్లలను చక్కగా చదివించుకుంటాం.

– పెంట్ల జ్యోతి, ఏకేసీకాలనీ, 40వ వార్డు

తల్లికి వందనం వెంటనే అమలు చేయాలి



మాకు ఇద్దరు పిల్లలున్నారు. బాబు గౌతంరాజు సరిపిల్లి భాష్యంలో 9వ తరగతి చదువుతున్నాడు. పాప కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ప్రతిభా పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. నా భర్త ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్. ఇంట్లో ఎంత మంది చదువుకున్న పిల్లలుంటే అంత మందికీ రూ.15 వేలు చొప్పున వేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులే మాకు ఆధారం. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. అవి మా పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. తల్లికి వందనం డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం.

– బుగాది పద్మ, శివశక్తినగర్

ఇద్దరికి ఇస్తారో ఇవ్వరో..



నాకు ఇద్దరు మగ పిల్లలు. ఇద్దరినీ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా అమ్మ ఒడి వచ్చింది. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పింది. స్కూలు పునఃప్రారంభమై నెల అవుతోంది. కానీ ఇప్పటికీ ఈ పథకంపై ఎలాంటి స్పష్టత లేదు. గత ప్రభుత్వ హయాంలో జూన్‌లోనే అమ్మఒడి వచ్చేది. వాటితో పిల్లలకు కావాల్సిన పుస్తకాలు, వస్తువులు కొనుక్కొనేవాళ్లం. ఈ ఏడాది ఇప్పటి వరకు కొనలేదు. ఎప్పటికిస్తారో తెలియడం లేదు.

– ఎం.లక్ష్మీప్రసన్న, అల్లిపురం

ఆధార్ సర్వర్ డౌన్

- నిలిచిన రిజిస్ట్రేషన్లు
- తిరిగి సాయంత్రం ప్రారంభమైన సేవలు

విశాఖ సిటీ: దేశవ్యాప్తంగా ఆధార్ సేవలు నిలిచిపోవడంతో జిల్లాలో దాని అనుసంధానమైన ప్రభుత్వ సేవలన్నీ గురువారం స్తంభించిపోయాయి. ఆధార్‌కు సంబంధించిన విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆధార్ సంబంధిత ఓటీపీలు, ఇతర తరహా సేవల్లో అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావం ప్రధానంగా బ్యాంకులు, రిజిస్ట్రేషన్లు వంటి సేవలపై పడింది. ఆయా శాఖల్లో ఆధార్ అనుసంధానిత సేవలకు సంబంధించిన ఓటీపీలు రాకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సమస్య తలెత్తింది. దీంతో గురువారం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు పూర్తిగా ఆగిపోయాయి. ఆస్తుల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లకు ఆటంకం ఏర్పడింది. మధ్యాహ్నం పది నిమిషాల పాటు సర్వర్ పనిచేసి.. మళ్లీ మొరాయించింది. దీంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి వేచి చూసి అనేక మంది వెనుదిరిగారు. చివరకు సాయంత్రం 6 గంటల తరువాత సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చినట్లు సమాచారం అందింది. అప్పుడు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు పునఃప్రారంభమయ్యాయి. ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు చెబుతున్నారు.

గ్రీన్ సిటీగా విశాఖ

ముఖ్యమంత్రి చంద్రబాబు

గోపాలపట్నం: అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సాయంత్రం 7 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు మంత్రులు, అధికారులు, నాయకులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రాజెక్ట్‌లు, మౌలిక వసతుల కల్పనపై ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పలు అభివృద్ధి అంశాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. విశాఖను గ్రీన్‌సిటీగా మార్చాలని అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్న ఆయన.. మెడ్‌టెక్ అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. కొత్తవలసలోనే గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. సమీక్షలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, టి.జి.భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీలు శ్రీభరత్, సీహెచ్ రమేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణ, పి.రమేష్‌బాబు, గంటా శ్రీనివాసరావు, గణబాబు, పి.విష్ణుకుమార్ రాజు, కలెక్టర్ హరేందిర ప్రసాద్, జాయింట్ సీపీ డాక్టర్ ఫకీరప్ప, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఫీడర్ల లోపాలపై ప్రత్యేక సర్వే

- లోపాలు గుర్తించి నిరంతరాయ విద్యుత్‌కు ప్రత్యేక కార్యాచరణ
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలో సుమారు 500 ఫీడర్లలో ప్రత్యేక సర్వే నిర్వహించామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సర్వేలో గుర్తించిన లోపాలను పీఎంఐ సర్వే యాప్‌లో నమోదుచేసి వాటిని సరిచేసి అంతరాయాలను తగ్గిస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా, నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు. ఆయా సర్కిళ్ల ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి.. విద్యుత్ అంతరాయాల నివారణకు చేపట్టాల్సిన చర్యలకు సంబంధించి సూచనలిచ్చారు. జిల్లాల వారీగా తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను గుర్తించేందుకు 33 కెవి ఫీడర్స్, 11 కేవీ ఫీడర్స్‌ని ఎంపిక చేసుకొని వాటిని సర్వే చేసి లోపాలను పీఎంఐ సర్వే మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ సంబంధిత సమస్యలను టోల్ ఫ్రీ నంబర్ 1912 కు తెలియచేస్తే సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఘోర అవమానం

- అపాయింట్‌మెంట్ ఇవ్వని చంద్రబాబు
- మెడ్‌టెక్‌కు వచ్చినా పట్టించుకోని సీఎం
- కార్మిక సంఘాల్లో తీవ్ర అసంతృప్తి

విశాఖ విద్య: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులకు తీవ్ర అవమానం చోటుచేసుకుంది. తమ సమస్యలు చెప్పుకుందామని వెళ్లిన నాయకుల వైపు చంద్రబాబు కన్నెత్తి కూడా చూడకపోవటంతో కార్మిక సంఘాల్లో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. సీఎం చంద్రబాబు విశాఖ పర్యటనలో భాగంగా స్టీల్ ప్లాంట్ సమీపంలోని మెడ్‌టెక్ సందర్శనకు వచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రావటంతో సమస్యలు చెప్పుకునే అవకాశం దక్కుతుందని భావించిన వివిధ సంఘాల నాయకులు అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించారు. కానీ స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులకు ఆ అవకాశం దక్కలేదు. జిల్లాకు చెందిన కూటమి నాయకులు సైతం కార్మిక సంఘాల నాయకుల విన్నపాన్ని సీఎం వద్ద ప్రస్తావించే ప్రయత్నం చేయకపోవటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సీఎం హోదాలో దేశ ప్రధానిని కలిసిన సందర్భంలో కూడా స్టీల్‌ప్లాంట్ అంశాన్ని ప్రస్తావించలేదని, విశాఖ పర్యటనలో కూడా కార్మిక సంఘాల వారి సమస్యలను వినేందుకు కూడా ఇష్టపడకపోవటం ఓడ దాటిన తరువాత బోడమల్లన్న రీతిలో ఉందని నాయకులు పెదవి విరుస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు, అడిగిన వెంటనే తమ విన్నపాన్ని పరిగణలోకి తీసుకొని ఎయిర్‌పోర్టులో గంటా 40 నిమిషాలు కార్మిక సంఘాల నాయకులతో సమావేశమైన సందర్భాన్ని గుర్తుకు చేసుకుంటున్నారు. తమ విజ్ఞాపన మేరకు అసెంబ్లీలో సైతం నాడు స్టీల్ ప్లాంట్ సమస్యపై ఏకగ్రీవ తీర్మానం చేశారని, నాటి ప్రభుత్వ సహకారం వల్లనే నాలుగేళ్ల పాటు విజయవంతంగా ఉద్యమాన్ని నడిపామని నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్మిక సంఘాల నాయకులను కలవనివ్వని సీఎం చంద్రబాబు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ కార్యక్రమాల అమలుపై సంతృప్తి

సమీక్ష నిర్వహించిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్



హాజరైన జీవీఎంసీ అధికారులు



సమీక్షిస్తున్న 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ రమణారెడ్డి, సభ్యులు ప్రసాదరావు, పద్మారావు

మహారాణిపేట: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆంధ్రప్రదేశ్ 5వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సమీక్ష చేపట్టింది. జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో గురువారం కమిషన్ మెంబర్ సెక్రటరీ కె.వి.రమణారెడ్డి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ఎం.వి.ఎస్.పద్మారావు, కె.కృపారావు సమీక్ష నిర్వహించగా.. జీవీఎంసీ డీసీఆర్ శ్రీనివాసరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. జీవీఎంసీ రెవెన్యూ, స్మార్ట్ సిటీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పట్టణ ప్రణాళిక, తాగునీరు మొదలైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీసీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ రెవెన్యూ పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో జీవీఎంసీ వృద్ధిరేటు, ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులు, వాణిజ్య సముదాయాల అద్దెలు, తాగునీటి పన్నులు మొదలైన అంశాలను వివరించారు. ఇక్కడ భూ ఆధారంగా మార్కెట్ రేట్లు అధికంగా ఉన్నాయని, ఇందుకు అనుగుణంగా వాణిజ్య సముదాయాల అద్దెలు నిర్ణయిస్తున్నట్లు తెలిపారు. దీంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదని, వాణిజ్య సముదాయాల అద్దెలు తగ్గించేలా ప్రభుత్వానికి నివేదించాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ విభాగంలో విశాఖ నగరం 8వ ర్యాంకు సాధించిందని, రూ.1000 కోట్లతో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు చేపట్టినట్లు డీసీఆర్ తెలిపారు. ఇప్పటివరకు రూ.649 కోట్లతో 57 ప్రాజెక్టులను పూర్తి చేశామన్నారు. మరో నాలుగు ప్రాజెక్టులు దాదాపు పూర్తయ్యాయన్నారు. సోలార్ ప్లాంట్ ద్వారా ఐదు మెగావాట్ల విద్యుత్ ఆదా అవుతోందన్నారు. 25 ఎకరాల్లో కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ వద్ద జిందాల్‌తో వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి.. రోజుకు 1000 టన్నుల వ్యర్థాల నుంచి పది మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీవీఎంసీ ఆదాయం, జమలు, వ్యయాలపై ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి కమిషన్ సభ్యులకు వివరించారు. జీవీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలపై కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేస్తూ.. లోటుపాట్లపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. జీవీఎంసీ ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ, కార్యనిర్వాహక ఇంజనీర్ సుబ్బారావు, డీసీపీ రామకృష్ణారెడ్డి, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, ఎస్ఆర్‌యూ టీం కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ రాజమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫోన్లతో క్రియేటివిటీని కోల్పోతున్నాం

• మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కొమ్మాది: ప్రస్తుత కాలంలో మనం ఏం తెలుసుకోవాలన్న గూగుల్‌ను అడగాల్సిన పరిస్థితి నెలకొందని.. ఫోన్ల వల్ల మనలో ఉన్న సృజనాత్మకతను కోల్పోతున్నామని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కాపులుప్పాడలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో గురువారం నిర్వహించిన ఆర్ట్ వర్క్ ఎగ్జిబిషన్‌లో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబుతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలంలో మొబైల్ ఫోన్ల వల్ల ఇంట్లో వారితో కాలం గడిపే అవకాశం లేకుండా పోతోందన్నారు. పూర్వీకులు మనకు అందించిన సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మన దేశంలో 64 కళలు ఉన్నాయని, వాటిలో ఏదో ఒక రంగంలో విద్యార్థులు రాణించాలని సూచించారు. గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలు అన్ని కళల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు వేసిన చిత్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. సింహాచలం దేవస్థానం ఆవశ్యకతను తెలిపే విధంగా చక్కటి బొమ్మలు గీయడం ఆనందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మిజోరం గవర్నర్ హరిబాబు

ఫైనల్స్‌కు ఉత్తరాంధ్ర లయన్స్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్ ఫైనల్స్‌కు ఉత్తరాంధ్ర లయన్స్ చేరుకుంది. ఎలిమినేటర్‌లో విజయం సాధించిన వారియర్స్, క్వాలిఫైయిర్-1లో పరాజయం పాలైన రాయలసీమ కింగ్స్ టైటిల్ పోరుకు అర్హత సాధించేందుకు శుక్రవారం పోటీపడనున్నాయి.

ఎలిమినేటర్ మ్యాచ్‌లో వారియర్స్ విజయం

నాకౌట్‌లో వైజాగ్ వారియర్స్ విజయం సాధించి క్వాలిఫైయిర్‌కు చేరుకోగా.. నిరుటి టైటిల్ పోరులో తలపడ్డ కోస్టల్ రైడర్స్ ప్లేఆఫ్‌లోనే నిష్క్రమించింది. వైఎస్సార్ స్టేడియంలో గురువారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ ఏడు వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. 71 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన రైడర్స్.. లేఖజ్ రెడ్డి(43) నిలకడగా ఆడి ఐదో వికెట్‌కు జట్టు స్కోర్‌ను 142 పరుగులకు చేర్చాడు. అభిషేక్ 42 పరుగులతో నిలిచాడు. కెప్టెన్ రషీద్ 24 పరుగులతో సుదర్శన్‌కు దొరికిపోయాడు. మల్లికార్జున, మనోహర్ రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన వారియర్స్ ఓపెనర్ మనీష్ 13 పరుగులతో పెవిలియన్‌కు చేరాడు. అతని స్థానంలో వచ్చిన కెప్టెన్ భరత్‌తో కలిసి వైస్ కెప్టెన్, మరో ఓపెనర్ అశ్విన్ రెండో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. 124 పరుగుల వద్ద అశ్విన్(67) సిద్ధార్థ బౌలింగ్‌లో ప్రమోద్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. భరత్(54), తేజ(14) అజేయంగా నిలిచారు. వారియర్స్ రెండు వికెట్లే కోల్పోయి 19 ఓవర్లలో 157 పరుగులు చేసి.. క్వాలిఫైయర్‌కు చేరింది.


భారీ షాట్ ఆడుతున్న వైజాగ్ వారియర్స్ బ్యాటర్ భరత్

ఓటమి పాలైన కింగ్స్

క్వాలిఫైయిర్-1లో ఉత్తరాంధ్ర లయన్స్ ఆరు వికెట్ల తేడాతో కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి లయన్స్ లక్ష్య ఛేదనకే మొగ్గుచూపడంతో రాయలసీమ కింగ్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. పవర్‌ప్లే ముగిసేప్పటికి 35 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. వంశీకృష్ణ(35) నిలకడగా రాణించాడు. వాసు, శ్రీనివాస్, కుమార్ రెండేసి వికెట్లు తీశారు. పవర్ ప్లేలోనే రెండు క్యాచ్‌లు కింగ్స్ జారవిడవడంతో ఆరు ఓవర్లకు లయన్స్ 31 పరుగులు చేసింది. పవర్‌ప్లేకు మరో బంతి ఉండగా రఫీ బౌలింగ్‌లో రవికిరణ్(5) లెగ్ బిఫోర్‌గా దొరికిపోయాడు. లయన్స్ పది ఓవర్లు ముగిసేప్పటికి ఓ వికెట్ కోల్పోయి 62 పరుగులు చేసింది. కెప్టెన్ తపస్వి 34 పరుగులు చేయగా సాత్విక్ (5) వెంటనే వెనుదిరగడంతో తక్కువ స్కోరును కాపాడుకునేందుకు కింగ్స్‌కు అవకాశం దక్కింది. అయితే ఓపెనర్ తరుణ్ అర్ధసెంచరీ నమోదు చేసి విజయం దిశగా మార్గం సుగమం చేశాడు. దీంతో 17.2 ఓవర్లలో లయన్స్ నాలుగు వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేసి ఫైనల్స్‌కు చేరుకుంది.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం..

• ప్రయాణికుల కోసం స్పెషల్ రైలును సిద్ధం చేసిన అధికారులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఒక కోచ్‌లో గురువారం సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఈ రైలును రద్దుచేసి ప్రయాణికుల సౌకర్యార్థం మరో ప్రత్యేక రైలు 14-థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లతో విశాఖపట్నం నుంచి వందేభారత్ మార్గంలో అదే హాల్ట్‌లతో నడిచే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ ప్రత్యేక రైలు ఉదయం 6.45 గంటలకు (గంట ఆలస్యంగా) విశాఖపట్నంలో బయల్దేరింది. సమస్యను గుర్తించిన వెంటనే అధికారులు స్పందించి డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్‌ప్రసాద్ ఆదేశాలతో వేరే ప్రత్యేక రైలు ఏర్పాటుచేశారు. రైలు ప్రయాణికులకు కేటరింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

నేడు హైకోర్టు జడ్జి రాక

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు శుక్రవారం విశాఖ వస్తున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి 11.31 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌లో దిగి నేరుగా ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకొని రాత్రికి అక్కడ బస చేస్తారు. 13న సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 14న సాయంత్రం 6.55 గంటలకు ఇండిగో విమానంలో విజయవాడ వెళ్తారు.

అవంతి కళాశాలలకు స్వయంప్రతిపత్తి

తగరపువలస: చెరకుపల్లి(తగరపువలస), మాకవరపాలెం(నర్సీపట్నం) అవంతి ఇంజినీరింగ్ విద్యాసంస్థలకు పదేళ్లకు గానూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయంప్రతిపత్తి మంజూరు చేసిందని విద్యాసంస్థల చైర్మన్, మాజీమంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. చెరకుపల్లిలో గురువారం జరిగిన అవంతి కుటుంబ సభ్యుల సమావేశంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న ఏకైక లక్ష్యంతో 1999లో విద్యాసంస్థలను స్థాపించినట్టు తెలిపారు. ఈ కళాశాలలు జాతీయస్థాయిలో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ నుంచి ఎ+ గుర్తింపు పొందాయన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య అందించడంలో అత్యంత ప్రజాదరణ పొందిన కళాశాలలపై ఇండియాటుడే మ్యాగజైన్ చేసిన సర్వేలో ఉత్తమ కళాశాలలుగా గుర్తించబడ్డాయన్నారు. కళాశాలల్లో అత్యాధునిక ప్రయోగశాలలు, సమగ్ర అభివృద్ధితో వసతులు కల్పించామన్నారు. అవంతి విద్యా సంస్థల నుంచి వేలాది మంది విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శివనందీష్, ప్రిన్సిపాళ్లు మోహనరావు, మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


అవంతి కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గాజువాకలో హ్యాపీ మొబైల్ షోరూమ్ ప్రారంభం

విశాఖ విద్య: గాజువాక బాలు కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాపీ మొబైల్ షాప్‌ను ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి చేతులమీదగా గురువారం ప్రారంభించారు. బ్రాండెండ్ కంపెనీల సెల్‌ఫోన్‌లతో పాటు, ఎల్‌ఈడీ టీవీలు, ల్యాప్‌ట్యాప్‌లపై ప్రారంభ ఆఫర్‌లను ఇస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు ప్రకటించారు. మొబైల్స్ కొనుగోళ్లపై ఉచిత ఆఫర్‌లను కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులకు బెస్ట్ సర్వీసు ఇవ్వాలనే లక్ష్యంతో గాజువాకలో తమ సంస్థ బ్రాంచిని ప్రారంభించినట్లు సంస్థ సీఎండీ కృష్ణ పవన్ తెలిపారు.



రెడ్‌మీ 13 మొబైల్ లాంచ్ చేస్తున్న నటి మీనాక్షి చౌదరి

విలేకరికి టీడీపీ మాజీ కార్పొరేటర్ బెదిరింపులు

మధురవాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే మధురవాడలో భూ ఆక్రమణలు పెరిగిపోయాని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినందుకు.. టీడీపీ మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు విలేకరిపై బెదిరింపులకు దిగారు. వివరాలివీ.. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మధురవాడ రైతుబజార్‌లో గురువారం మధ్యాహ్నం నిత్యావసర వస్తువుల రాయితీ కౌంటర్ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతున్న తరుణంలో కొందరు విలేకరులు మధురవాడలో భూ ఆక్రమణలు పెరుగుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా శ్రీలక్ష్మీనగర్, చంద్రంపాలెంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నారన్నారు. ఈ క్రమంలో ఓ విలేకరి ఈ ఆక్రమణల్లో టీడీపీ మాజీ కార్పొరేటర్ పాత్ర ఉందంటూ తెలిపారు. దీనిపై గంటా స్పందిస్తూ ఎవరూ ప్రభుత్వ భూములను ఆక్రమించినా సహించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న జీవీఎంసీ 4వ వార్డు టీడీపీ మాజీ కార్పొరేటర్ సోంబాబు భూ ఆక్రమణలు గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన విలేకరిపై చిందులు తొక్కారు. తన మీదే ఫిర్యాదు చేస్తావా? నీ అంతు చూస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆ విలేకరికి సహచరులు బాసటగా నిలవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాసేపు ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ నాయకులు సోంబాబును అక్కడ నుంచి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.


విలేకరులను హెచ్చరిస్తున్న మాజీ కార్పొరేటర్ సోంబాబు

త్వరితగతిన హార్బర్‌లో ఆధునికీకరణ పనులు

• మత్స్యశాఖ కార్యదర్శి ఎ.బాబు

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన ఆధునికీకరణ పనులు నిర్దేశించిన సమయంలో పూర్తవుతాయని రాష్ట్ర మత్స్యశాఖ కార్యదర్శి ఎ.బాబు తెలిపారు. గురువారం హార్బర్‌లో కేంద్ర ప్రభుత్వం సహకారంతో చేపట్టిన రూ.170 కోట్ల పనులను ఆయన పరిశీలించారు. 2025 డిసెంబర్ నాటికి ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు పూర్తవుతాయన్నారు. హార్బర్‌లో అన్ని చోట్ల మంచినీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హార్బర్‌లో పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా చేపల వేలం ప్రాంతం తక్షణమే నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (మెరైన్) వెంకటేశ్వరరావు, విశాఖ మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకృష్ణ, ఏడీ విజయ, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి, విశాఖ పోర్టు అథారిటీ సెక్రటరీ, విశాఖ పోర్ట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ హరికృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ వికాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్, డాల్ఫిన్ బోర్డు అసోసియేషన్ ప్రెసిడెంట్ చింతపల్లి వీర్రాజు, కార్యదర్శి వలిశెట్టి చిన్న, ఉపాధ్యక్షుడు ధోని నాగరాజు, ఏపీ మెకనైజ్డ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దూడ పోలయ్య, బోట్ యజమానులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి: జానకిరామ్

ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ పలు సమస్యలను ప్రభుత్వ సెక్రటరీ బాబు దృష్టికి తీసుకుని వెళ్లారు. అనేక సమస్యలపై బాబుకు వినతిపత్రం అందజేశారు. వీటిలో ప్రధానంగా ప్రభుత్వం నుంచి రావాల్సినటువంటి డీజిల్ సబ్సిడీ బకాయిలను విడుదల చేయాలని, విశాఖకు సంబంధించి రూ.2.78 కోట్లు బకాయిలు ప్రభుత్వం దగ్గర రావాల్సి ఉందని వాటిని విడుదల చేయాలని కోరారు.

సెయిల్‌లో విలీనంతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం

• కేంద్ర మంత్రికి వినతి

ఉక్కునగరం : సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనం చేయడంతోనే స్టీల్‌ప్లాంట్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ), ఉక్కు పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మలను ఉక్కు పరిపాలన భవనంలో సీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం వర్కింగ్ క్యాపిటల్ లేకపోవడం వల్ల ఉత్పత్తి తగ్గిందని, సొంత గనులు లేకపోవటం వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుందన్నారు. సాలీనా ఇది రూ.3 వేల కోట్లని, విస్తరణ కోసం చేసిన అప్పుల వల్ల వడ్డీ భారం ఏడాదికి రూ.1800 కోట్లు అవుతుందన్నారు. తక్షణమే పూర్తి సామర్థ్యంతో నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారుల పదోన్నతులు, వేతన సవరణ గురించి వివరించారు. కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కె.వి.డి.ప్రసాద్, నరసింహ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


విలీనం వల్ల ఇరు సంస్థలకు లాభం

పోరాట కమిటీ నాయకులు అందజేసిన వినతిపత్రంలో సెయిల్‌లో విలీనం చేయడం వల్ల విశాఖ ఉక్కుకు ముడి సరుకుల భద్రత లభిస్తుందన్నారు. విలీనం వల్ల ఇరు సంస్థలకు లాభదాయకమన్నారు. ప్రస్తుత ప్లాంట్ గడ్డు పరిస్థితి దాటడానికి అవసరమైన వర్కింగ్ క్యాపిటల్, ప్రిఫరెన్షియల్ షేర్స్, లెటర్ ఆఫ్ కంఫర్ట్ వంటి ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. అదే విధంగా ఎన్ఎండీసీ నుంచి రెండేళ్ల రుణ వ్యవధితో ఐరన్ ఓర్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. నూతన వేతనాలు అమలు చేయకపోగా సకాలంలో జీతాలు చెల్లించకుండా ఉద్యోగులను సీఎండీ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రైవేటీకరణకు అనుగుణంగా ఆస్తుల అమ్మకం సాగిస్తున్నారన్నారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, రామ్మోహన్‌కుమార్, కర్రి దాలినాయుడు, బొడ్డు పైడిరాజు, పాడి త్రినాథరావు, వరసాల శ్రీనివాసరావు, బి.డేవిడ్, డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రులకు వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు అధికారుల సంఘం నాయకులు

భెల్ సమస్యల పరిష్కారానికి వినతి


అక్కిరెడ్డిపాలెం: విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలను గురువారం భెల్(హెచ్‌పీవీపీ) బీఎంఎస్ యూనియన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారికి భెల్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సంస్థకు కావాల్సిన ఆర్డర్లు, ఆర్టిజన్ రిక్రూట్‌మెంట్, యూనిట్‌కు ఎక్కువ మార్జిన్ ఉన్న ఉత్పత్తుల గుర్తింపు, తదితర అంశాలను అందులో పేర్కొన్నారు. మంత్రులను కలిసిన వారిలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎ.రమేష్ కుమార్, కోశాధికారి భూపేంద్ర భిషి, సంయుక్త కార్యదర్శి ఎల్.డి.సాహు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న భెల్ బీఎంఎస్ నాయకులు

ఆటోడ్రైవర్ దాడిలో వృద్ధుడి మృతి

• ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

గోపాలపట్నం: మద్యం మత్తులో ఆటోడ్రైవర్ ఓ వృద్ధుడిపై దాడి చేసి.. అతని మరణానికి కారణమయ్యాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన చంద్రానగర్‌లో చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. చంద్రానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ అక్కరబోయిన శ్రీధర్ ఈ నెల 4వ తేదీ సాయంత్రం మద్యం సేవించి వీధిలో వీరంగం సృష్టించాడు. ఎప్పుడూ తాగి తిడుతుంటావ్ అంటూ అదే ప్రాంతానికి పునుగంటి పాలమ్మ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ఆమెపై శ్రీధర్ రాయితో దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న ఆమె తండ్రి దేవుడు(70) దీనిని అడ్డుకునేందుకు యత్నించగా.. అతన్ని శ్రీధర్ రాయితో బలంగా కొట్టాడు. ఈ ఘటనలో గాయాలపాలైన దేవుడును స్థానికులు కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. ఈ దాడిలో పాలమ్మకు కూడా గాయాలయ్యాయి. దేవుడు గేదెలు కాస్తూ పాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. దాడి అనంతరం నిందితుడు పరారయ్యాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సురేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు నెల్లూరులో ఉన్న నిందితుడు శ్రీధర్‌ను అదుపులోకి తీసుకుని.. గురువారం రిమాండ్‌కు తరలించారు.


మృతుడు దేవుడు

14న జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు

మురళీనగర్ : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఈనెల 14వ తేదీన నాల్గవ జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు విశాఖ రోల్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట లలితప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు అండర్-11, 14, 17, 17 ఏళ్లు దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9505950425 నంబరులో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేటి వరకే ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ల గడువు

మురళీనగర్ : ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు శుక్రవారంతో ముగుస్తుంది. దీంతో గురువారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్ కేంద్రానికి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఇచ్చి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. శనివారం ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉంది. ఈనెల 16న సీట్లు కేటాయిస్తారు. 17 నుంచి 22 తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఆన్‌లైన్‌లో చేసి కాలేజీలకు ఆ రిపోర్టు సమర్పించాలి. 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఆఖరి దశ పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి పాలిసెట్ ఆఖరి విడత కౌన్సెలింగ్ కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో గురువారం ప్రారంభమైంది. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోలేనివారు తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకుని వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. వీరు 13వ తేదీ వరకు వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవచ్చు. 14న ఆప్షన్ల మార్పిడి, 16న సీట్ల కేటాయింపు ఉంటుంది. 18 నుంచి 20వ తేదీ వరకు సెల్ఫ్ జాయినింగు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

పుట్టెడు దుఃఖంలో నేత్రదానం

పద్మనాభం: తేనెటీగల దాడిలో గాయపడి మృతి చెందిన రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పుప్పాల శ్రీను(45) నేత్రాలను గురువారం అతని కుటుంబ సభ్యులు దానం చేశారు. వివరాలివీ.. పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన పుప్పాల శ్రీను ఈ నెల రెండో తేదీన విజయనగరం జిల్లా జామి మండలం అన్నంరాజుపేటలో పెయింటింగ్ పనులకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి రెడ్డిపల్లి వస్తుండగా మార్గమధ్యలో పొట్నూరు ఏటుకట్టు వద్ద తేనెటీగలు శ్రీనుపై బలంగా దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స కోసం విజయనగరం మహారాజ ఆస్పత్రిలో చేర్పించారు. కొద్ది రోజులు ఆస్పత్రిలో చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఈ నెల 10న శ్రీను మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు పెద్ద మనసుతో శ్రీను నేత్రాలతో మరొకరికి కంటి చూపు ప్రసాదించాలని సంకల్పించారు. కేజీహెచ్ మార్చురీలో శ్రీను మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి.. అతని నేత్రాలను హనుమంతువాక వద్ద ఉన్న ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు అప్పగించారు. ఈ మేరకు ధ్రువీకరణపత్రాన్ని ఎల్.వి ఆస్పత్రి యాజమాన్యం శ్రీను కుటుంబ సభ్యులకు అందజేసింది.


నేత్రాలు దానం చేసిన శ్రీను(ఫైల్)

ఏపీజీఈఏ విశాఖ సిటీ నూతన కార్యవర్గం

దాబాగార్డెన్స్: ఏపీజీఈఏ విశాఖ సిటీ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం పిఠాపురం కాలనీలో గల అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఎన్నికల అధికారిగా వి.రాజేశ్వరి, ఉప ఎన్నికల అధికారిగా వి.ధనరాజు, అబ్జర్వర్‌గా యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఎం జవహర్‌లాల్ వ్యవహరించారు. విశాఖ సిటీకి సంబంధించి 16 మంది నామినేషన్లు వేశారు. స్క్రూటినీ అనంతరం అన్ని సక్రమంగా ఉండడంతో 16 నామినేషన్లు ఓకే చేశారు. అధ్యక్షుడిగా డి.రాజశేఖర్‌రెడ్డి(కేజీహెచ్), కార్యదర్శిగా డీవీఎస్ఎన్ రాజు(పబ్లిక్ హెల్త్), కోశాధికారిగా సీహెచ్.హరగోపాల్(ట్రెజరీ), అసోసియేట్ అధ్యక్షుడిగా జీవన్ సంతోష్(వీజీహెచ్), ఉపాధ్యక్షులుగా కె.వెంకట్రావు(పంచాయతీరాజ్), ఎం.అమర్‌నాథ్(ఏహెచ్), బి.సుచరిత నితాల్(ఆర్ అండ్‌బీ), సి.గణేష్ మారుతీరావు(ఆయుష్), ఐ.గోపీకృష్ణ(స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పీవీ సత్యం(జీవీఎంసీ), సంయుక్త కార్యదర్శులుగా పి.వేంకటేష్(ఆర్‌డీఎంహెచ్), బి.ప్రసాద్(ఐడీడీఎస్), ఎస్.దిలీప్‌కుమార్(కమర్షియల్ టాక్స్), కె.రోహిణికుమార్(జీవీఎంసీ), ఎన్.భానురేఖ(ట్రాన్స్‌పోర్ట్), బి.సతీష్‌కుమార్(ఆర్టీసీ)ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.


నూతన కార్యవర్గం

సెప్టెంబర్‌లో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు

అల్లిపురం: విశాఖ వేదికగా సెప్టెంబర్‌లో మూడు రోజుల పాటు ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె. అచ్యుతరావు తెలిపారు. ఈ సమావేశాలకు దేశ నలుమూలల నుంచి 500 మంది ఏఐటీయూసీ జాతీయ అగ్రనాయకులు రానున్నట్లు వివరించారు. గత సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. సమావేశాల్లో భాగంగా మొదటి రోజు వేలాది మందితో కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై చర్చించి.. భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధ రావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్, కోశాధికారి కె.సత్యాంజనేయ, స్టీల్ గుర్తింపు సంఘం(ఏఐటీయూసీ) కోశాధికారి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.117
స్కిన్	: రూ.204
స్కిన్‌లెస్	: రూ.214

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	575.00
విజయనగరం	579.00
శ్రీకాకుళం	579.00

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.73,470
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.67,300
వెండి(కిలో):	రూ.95,500